క్లుప్తంగా

ఘనంగా ధారగంగమ్మ తొలేళ్ల ఉత్సవం


పూజలందుకుంటున్న ధార గంగమ్మ అమ్మవారు

శృంగవరపుకోట: ఎస్.కోట గ్రామదేవత ధారగంగమ్మ పండగతో కోట కిటకిటలాడుతోంది. పట్టణంలో ప్రతీ గడప బంధువులతో కిక్కిరిసింది. రెండేళ్లకోసారి జరిగే అమ్మ పండగ కోసం ఆడపిల్లలు, బంధువులు, స్నేహితులుకోటకు విచ్చేయడంతో వీధులు కిటకిటలాడుతున్నాయి. సోమవారం అమవారిని ప్రత్యేకంగా అలంకరించి తొలేళ్ల ఉత్సవానికి సిద్ధం చేశారు. రాత్రి 7గంటల నుంచి పండగ సందడి ఆరంభమయ్యింది. మొక్కులు తీర్చాల్సిన కుటుంబాల వారంతా ఉదయం నుంచి ఉపవాసాలు చేస్తూ తొలేళ్ల తిరిగేందుకు సిద్ధమయ్యారు. గద్దె ఇంటిలో అమ్మవారిని, అటు ఆలయంలో మూలమూర్తి, అర్చామూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. ఘటాలను గొల్లవీధి, సాలి వీధి, ఎడ్లవీడి, కాపువీధి, చింతాదెప్పి, దామోద ర వీ ధి, పెద్దవీధి, కొటాన వీధి, పాలమరశెట్టి దొ డ్డి, మోపాడవీధి, మొండివీధుల మీదుగా పురసాకారి జంక్షన్, చినవేమలి వీధి, చిన్నదొ డ్డి, వస్‌వే జంక్షన్‌ల మీదుగా గాంధీ జంక్షన్‌లో ఉన్న శతకం పట్టుకు ఘటాలు చేర్చారు. అ క్కడ తొలేళ్ల ఉత్సవం వైభవంగా నిర్వహించారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి


న్యాయవాదులు,పోలీసులతో సమావేశమైన జడ్జి కనకలక్ష్మి

గజపతినగరం: స్థానిక సివిల్ కోర్టులో జూన్ 29న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి కోరారు. స్థానిక కోర్టులో పోలీసులు, న్యాయవాదులతో సోమవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా సివిల్, క్రి మినల్, తదితర కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకునే అవకాశం ఉందని, ఈ విషయాన్ని కక్షిదారులకు తెలియజేయాలని సూచించారు. రాజీయే రాజమార్గమని, ఇరువర్గాలను రాజీకుదుర్చి ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

వ్యర్థాలను ఇష్టారీతిగా పారబోయవద్దు


కోళ్లఫారాల యజమానులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ లోకేశ్వరరావు

మెరకముడిదాం: కోళ్ల ఫారం వ్యర్థాలను గ్రామానికి దూరంగా పారబోయాలని, అలా కాకుండా ఇష్టారీతిగా జనవాసాలకు దగ్గరలో పారబోస్తే చర్యలు తప్పవని బుధరాయవలస ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు కోళ్లఫారాల యజమానులను హెచ్చరించారు. 'కోళ్లఫారం వ్యర్థాలతో అవస్థలు' అనే శీర్షికతో ఈనెల 25వ తేదీన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. మండల కేంద్రంలోని కోళ్ల ఫారం యజమానులను సోమవారం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎస్‌ఐ మాట్లాడుతూ కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయానికి సమీపంలోని చెరువుగట్టుపై వ్యర్థాలను పారబోస్తుండడం వల్ల విద్యార్థినులు, అదే మార్గంలో పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ పారబోసినట్లు తమదృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తప్పిన ప్రమాదం


కారును ఢీకొట్టిన లారీ

గజపతినగరం: స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద కారుపైకి లారీ దూసుకు వెళ్లిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. విశాఖపట్నం నుంచి మెంటాడ మండలం జక్కువ గ్రామంలో జరిగే బంగారమ్మ తల్లి గ్రామదేవత పండగకు ఓ కుటుంబ సభ్యులు కారుతో వెళుతున్నారు. వీరి కారుపైకి గజపతినగరం నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ఓ లారీ దూసుకు వచ్చింది. లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. లారీ ఢీ కొట్టడంతో కారు ముందు భాగంగా దెబ్బతింది. కారులో ఉన్నవారికి ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

గజపతినగరం: జిన్నాం గ్రామం నుంచి ఇసుకను సోమవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండల కేంద్రంలో పోలీసులు సీజ్ చేశారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసును నమోదు చేశామని ఎస్‌ఐ యు.మహేష్ తెలిపారు.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు


బొండపల్లి:కిండాం అగ్రహారంలో వేతనదారుల మస్తర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ హరిహరరావు


గజపతినగరం రూరల్: కొణిశ గ్రామంలో కొలతలు వేయిస్తున్న ఏపీఓ రామారావు


దత్తిరాజేరు: చినచామలాపల్లిలో వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీఓ వెంకటప్పలనాయుడు

బొండపల్లి/ గజపతినగరం రూరల్/దత్తిరాజేరు: గజపతినగరం నియోజకవర్గంల ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. బొండపల్లి మండలం కిండాం అగ్రహారం గ్రామంలో నిక్రరివాని చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ ఎస్.హరిహరరావు,గజపతినగరం మండలంలోని కొత్తబగ్గాం, కొణిశ, దత్తిరాజేరు మండలం చినచామలాపల్లి గ్రామంలో పను లను ఏపీఓలు రామారావు, వెంకటఅప్పలనాయుడు సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు వేతనదారులతో మాట్లాడుతూ టెక్నికల్ అసిస్టెంట్లు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట వేతనం అందుతుందన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం త్వరగా పనులకు హాజరై 11గంటలలోపు ముగించాలని, మళ్లీ మధ్యాహ్నం ఎండ తీవ్రత తగ్గిన తర్వాత పనులకు హాజరు కావాలని సూచించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని, పనిప్రదేశాల్లో తప్పనిసరిగా తాగునీరు, టెంట్లు అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందన్నారు.

జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని


ఎం.కొత్తవలసలో వేతనదారులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

గజపతినగరం: మండలంలో ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు ఉన్న వారందరికీ అధికారులు ఉపాధి పనులు కల్పిస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు లేక పోవడంతో అన్ని గ్రామాల్లోనూ ఉపాధి పనులు జోరుగా సాగుతున్నాయి.మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో 8,750 మంది వేతన దారులు పనులకు హాజరవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. పని ప్రదేశంలో వేతనదారులకు తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, నీడ కోసం టెంట్లు అందుబాటులో ఉంచేలా ఉపాధి సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. టెక్నికల్,ఫీల్డ్ అసిస్టెంట్లు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 వేతనం అందుతుందని అధికారులు ఇప్పటికే వేతనదారులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం వేతనదారులు రూ.250 నుంచి రూ.270వరకు వేతనం పొందుతున్నారని ఏపీఓ సీహెచ్ రామారావు తెలిపారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న ఎంపీడీఓ పావని

మెరకముడిదాం: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించాలని ఎంపీడీఓ ఎం.పావని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో ఈఓపీఆర్డీ పుష్పారావుతో కలిసి పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ముందుగానే పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. వీధి కాలువల్లో పూడిక తీయించాలని,నివాస ప్రాంతాల్లోని బహిరంగ ప్రదేశాల్లో చెత్తను తొలగించాలని చెప్పా రు. పూడిక, చెత్తను తొలగించే యంత్రం చీపురుపల్లిలో అందుబాటులో ఉందని, ఆయంత్రాన్ని తీసుకువస్తే పనులు తొందరగా చేయవ చ్చని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ దృష్టికి తెచ్చారు. ఎంపీడీఓ స్పందిస్తూ సంబంధిత యంత్రం కోసం జిల్లా పంచాయతీ అధి కారికి లెటర్ పెడతామని తెలిపారు. చాలా గ్రామాల్లో పగలు వీధిలైట్లు వెలుగుతుండడం గమనించానని, విద్యుత్ అధికారులు సహకారం తీసుకుని లైట్లు రాత్రి వేళల్లో మాత్రమే వెలిగేలా సరిచేయాలన్నారు. ఇంటి పన్ను వసూళ్ల వేగవంతం చేయాలని సూచించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

దత్తిరాజేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రకుమారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు అధ్యక్షతన ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల అధికారులు హాజరు కావాలని కోరారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు


తహసీల్దార్ పద్మావతి

మెరకముడిదాం: జూన్ 5వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని మెరకముడిదాం తహసీల్దార్ వై.వి. పద్మావతి తెలిపారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయని, జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ కూడా ప్రశాంత వాతావరణంలో ముగిసేలా ప్రజలంతా సహకరించాలని కోరారు. 5వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్న విషయాన్ని అంతా గమనించాలన్నారు. అంతవరకూ పార్టీల వర్గాలు, నాయకులు, కార్యకర్తలు గొడవలకు దిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ


వల్లంపూడిలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ ఉమ

వేపాడ: మండల కేంద్రంతో పాటు, వల్లంపూడి పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులు సోమవారం నిర్వహించిన పారిశుద్ధ్య పనులను ఈఓపీఆర్డీ ఉమ పరిశీలించారు. వల్లంపూడి సబ్‌స్టేషన్ వద్ద వ్యర్థాలను, ఎస్సీ కాలనీలోని కాలువల్లో పూడికను తొలగించాలని కార్మికులకు సూచించారు. వేపాడ కాటా వద్ద మురుగు నీరు నిలిచిపోతుండడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఈఓపీఆర్డీ దృష్టికి తీసుకొచ్చారు. ఆమె స్పందిస్తూ వెంటనే అక్కడ పారిశుద్ధ్య పనులు చేయించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శులు వెంకటరమణ, గౌరి తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో సత్తా


చీపురుపల్లి: పతకాలు సాధించిన క్రీడాకారులతో శిక్షకుడు రమేష్


కొత్తవలస: పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్ నూకరాజు

చీపురుపల్లి: జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో ఈనెల26న నిర్వహించిన 17వ రాష్ట్రస్థాయి ఆహ్వానపు చాంపియన్ షిప్ కరాటే పోటీల్లో స్థానిక ఒకినోవా కరాటే అకాడమీకి చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారు. జూనియర్స్ విభాగం కుమిటీ(ఫైటింగ్) పోటీల్లో ఎస్.గౌతమ్ రజత పతకం, జి.నీరజ్‌నాయుడు కాంస్య పతకం సాధించారు. కరాటే విభాగంలో పి.రాధాకృష్ణ సిల్వర్ పతకం, జె.దీపక్‌నాయుడు కాంస్య పతకాలు సాధించారు. వివిధ విభాగాల్లో బి.వి.మేఘనశ్యామ్, బి.తుషార్ సాయి, జె.హన్సిక కాంస్య పతకాలు సాధించారు. వీరిని అకాడమీ వ్యవస్థాపకుడు, శిక్షకుడు డి.రమేష్ సోమవారం అభినందించారు.

కొత్తవలస విద్యార్థులకు పతకాలు


కొత్తవలస: జిల్లా కేంద్రంలో ఈనెల 26న నిర్వహించిన రాష్ట్రస్థాయి చాంపియన్ షిప్ కరాటే పోటీల్లో కొత్తవలస విద్యార్థులు పలు విభాగాల్లో బంగారు పతకాలు సాధించారు. కొత్తవలస పట్టణానికి చెందిన ఒకినోవా స్పోర్ట్స్ అకాడమీకి చెందిన కోచ్ కె.నూకరాజు ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. బాలుర విభాగం కుమిటీ పోటీల్లో విద్యార్థి కె.లక్ష్మీదీపక్ స్వర్ణం, కాటాస్లో రజత పతకాలు సాధించారు. బాలికల విభాగం కుమిటీ, కాటాస్లో పోటీల్లో కె.జయశ్రీ స్వర్ణ పతకాలు సాధించింది. మరికొన్ని విభాగాల్లో కె.నాగ వెంకటవంశీ, కె.బాలాజీ, పి.గౌరీప్రసన్న పతకాలు సాధించారు.

మొలకశాతం పరీక్షించిన తర్వాతే పంపిణీ


రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న జేడీ రామారావు

బొండపల్లి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి విత్తనాల మొలక శాతాన్ని రైతు భరోసా కేంద్రాల్లో(ఆర్బీకే) పరీక్షించిన తర్వాతనే రైతులకు పంపిణీ చేయనున్నామని వ్యవసాయశాఖ జేడీ వి.టి.రామారావు తెలిపారు. మండలంలోని నెలివాడ ఆర్బీకేలో రైతుల కు సోమవారం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 శాతం రాయితీపై రైతులకు జీలుగ,పిల్లిపెసర, కట్టె జనుము విత్తనా లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. జిల్లాలోని అన్ని ఆర్బీకేల్లో పచ్చిరొట్ట విత్త నాలను అందుబాటులో ఉంచామని, కావాల్సిన రైతులు తమ వివరాలను వీఏఏల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. 1121 రకం వరి విత్తనాలతో పాటు సోనామసూరి, స్వర్ణ ఇతర రకాల వరి విత్తనాలను ఆర్బీకేల్లో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.ఆయన వెంట గజపతినగరం వ్యవసాయశాఖ ఏడీఏ కె.మహరాజన్, ఏఓ పి.వి.మల్లికార్జునరావు, ఏఈఓ సంతోష్‌కుమార్, వీఏఏ అనిల్ ఉన్నారు.

తాగునీటి పైపులైన్‌కు లీకులు


పైపు లైన్ లీకవ్వడంతో రోడ్డుపై పారుతున్న నీరు

గంట్యాడ: తాటిపూడి రిజర్వాయర్ నుంచి మురపాక, పెదవేమలి గ్రామాలకు వెళ్లే పైపు లైన్‌కు మండలంలోని మురపాక గ్రామం వద్ద లీకులు అయ్యాయి. దీంతో తాగునీరు వృథాగా రోడ్డుపై ప్రవహిస్తోంది. అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విజ్ఞానం.. వినోదం


కొత్తవలస: విద్యార్థులకు యోగాసనాలు నేర్పిస్తున్న లైబ్రేరియన్ రామలక్ష్మి


లక్కవరపుకోట: విద్యార్థులతో కుర్చీ ఆట ఆడిస్తున్న లైబ్రేరియన్ మేరీనిర్మల

లక్కవరపుకోట/కొత్తవలస: శాఖా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంచడంతో పాటు వినోదాన్ని పంచుతున్నాయి. లక్కవరపుకోట,కొత్తవలస మండల కేంద్రాల్లోని గ్రంథాలయాల్లో లైబ్రేరియన్‌లు బి.మేరీనిర్మల, మీసాల రామలక్ష్మి విద్యార్థులతో పుస్తకాలు చదివించి, నీతి కథలు చెప్పడంతో పాటు, యోగాసనాలు నేర్పారు. అలాగే ఆటలు ఆడించారు. వచ్చే నెల 7వ తేదీ వరకు శిబిరాలు కొనసాగుతాయని చెప్పారు.

వెబ్ కౌన్సెలింగ్ ప్రారంభం

- పాలిటెక్నిక్ ప్రవేశాలకు జూన్ 3 వరకు కౌన్సెలింగ్
- హెల్ప్‌లైన్ సెంటర్లలో సర్టిఫికెట్ల పరిశీలన
- చీపురుపల్లి ప్రభుత్వ కళాశాలలో ఎలక్ట్రికల్, మెకానికల్ కోర్సులు


చీపురుపల్లి ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల

చీపురుపల్లి: పదో తరగతి ఉత్తీర్ణులై సాంకేతిక విద్య చదవాలనుకునే విద్యార్థులకు పాలిటెక్నికల్ కోర్సులు ఆహ్వానం పలుకుతున్నాయి. ఇంజినీరింగ్ చదివే విద్యార్థులు కంటే పాలిటెక్నికల్ కోర్సులు చదివే వారికి మరింత ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు సర్వేలు కూడా చెబుతున్నాయి. పాలిటెక్నిక్ కోర్సుల్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. చీపురుపల్లి ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఎలక్ట్రికల్, మెకానికల్ కోర్సులు ఉన్నాయి. ఈ కోర్సుల్లో గతంలో చదువుకున్న విద్యార్థులు ఇదే కళాశాలలో జరిగిన ప్రాంగణ నియామకాల్లో 56 మంది ఉద్యోగ అవకాశాలు పొందారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఇదివరకే పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాసి, ర్యాంకులు సాధించిన విద్యార్థుల కోసం వెబ్ కౌన్సెలింగ్ ప్రారంభ మైంది. మే 27 నుంచి జూన్ 3 వరకు వెబ్ కౌన్సెలింగ్ జరుగుతుంది. పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌లో సర్టిఫికెట్లు పరిశీలన చేయనున్నారు.

అన్నిసదుపాయాలు ఉన్నాయి..

స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఎలక్ట్రికల్, మెకానికల్ కోర్సులు ఉన్నాయి. నూతన భవనాలు, ల్యాబ్ సదుపాయం, నిష్ణాతులైన అధ్యాపకులు ఉన్నారు. గతేడాది నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 56 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. ఈ నెల 27న ప్రారంభమైన వెబ్ కౌన్సిలింగ్ జూన్ 3 వరకు ఉంటుంది. పాలిసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు సీట్ల కోసం వెబ్ కౌన్సెలింగ్‌లో చీపురుపల్లి కళాశాలను ఎంపిక చేసుకోవాలి. వెబ్ కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత సీట్లు మిగిలితే స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తాం.

– డాక్టర్ ఎల్.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల, చీపురుపల్లి

జిందాల్ కార్మికులకు అండగా సీఐటీయూ


కార్మికులకు మద్దతుగా నినాదాలు చేస్తున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాములమ్మ

కొత్తవలస: అప్పన్నపాలెం గ్రామ సమీపంలోని జిందాల్ స్టెయిన్‌లెస్‌స్టీల్ కర్మాగార కార్మికులకు న్యాయం జరిగే వరకు సీఐటీయూ, అనుబంధ కార్మిక సంఘాలు అండగా ఉంటాయని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రాములమ్మ తెలిపారు. ఈనెల 17వ తేదీన జిందాల్ కర్మాగారం లే ఆఫ్‌ను ప్రకటించడంతో నుంచి కర్మాగారం ప్రధాన గేటు వద్ద కార్మికులు నిరసన తెలుపుతున్నా రు.కార్మికుల దీక్షా శిబిరాన్ని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రాములమ్మ సోమవారం సందర్శించి తన సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ లే ఆఫ్‌ను ఎత్తేయాలని కార్మికులు చేస్తున్న పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.కర్మాగారాల యాజమాన్యాలకు కార్మికులపై చిన్నచూపు తగదన్నారు. అర్ధంతరంగా కంపెనీలు మూసేస్తే కార్మికులు కుటుంబాలు వీధిన పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిందాల్ కర్మాగారం తక్షణమే లే ఆఫ్ ఎత్తేయాలని,కార్మికులకు పూర్తి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 29వ తేదీన లేబ ర్ కమిషన్ వద్ద కార్మికులకు, యాజమాన్యానికి మధ్య జరగనున్న చర్చల్లో యాజమాన్యం సానుకూలంగా స్పందించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మిక సంఘం జేఏసీ నాయకులు గాడి అప్పారావు, నమ్మి చిన్నబాబు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించుకోవాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లైబ్రేరియన్ ఉషారాణి

చీపురుపల్లిరూరల్(గరివిడి): విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే చదువుతో పాటు నైతిక విలువలు పెంపొందించుకోవాలని గరివిడి లైబ్రేరియన్ ఎం.ఉషారాణి సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గరివిడి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు 'నైతిక విలువలు' అనే అంశంపై సోమవారం అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులు, పెద్దలను గౌరవించాలని, నీతి, నిజాయితీతో మెలగాలని, సంస్కృతి, సంప్రదాయాలను పాటించాలని చెప్పారు. రామాయణంలో పలు అంశాలను వివరించి, తండ్రి మాటను జవదాటని శ్రీరాముని జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పుస్తకపఠనం చేయాలని సూచించారు.

దోమల నివారణతో వ్యాధుల నిర్మూలన


పుణ్యగిరిలో ప్రజలతో మాట్లాడుతున్న మలేరియా అధికారి మణి

శృంగవరపుకోట: దోమల నివారణతో డెంగీ, మలేరియా వంటి వ్యాధుల నిర్మూలన సాధ్యమని జిల్లా మలేరియా అధికారి మణి అన్నారు. పుణ్యగిరిలో ఇటీవల దోమల నివారణకు ఏసీఎం 5 శాతం ద్రావణం పిచికారీ చేయించారు. జిల్లా మలేరియా అధికారి మణి కొట్టాం పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి సోమవారం ఇంటింటి కీ వెళ్లి పంచాయతీ సిబ్బంది దోమల నివారణ మందు పిచికారీ చేశారా లేదా అని ప్రజలను ఆరా తీశారు. ఈసందర్భంగా ఆమె ప్రజలతో మాట్లాడుతూ మలేరి యా, డెంగీ, టైఫాయిడ్, చికున్‌గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు దోమల వల్లే సంక్రమిస్తాయని చెప్పారు. నివాస పరిసరాల్లో దోమల నివారణకు ప్రజలు తమ వంతు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎస్‌యూఓ బి.శ్రీనివాసరావు, టెక్నికల్ సూపర్‌వైజర్ పి.రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్లు రామకృష్ణ, శంకర్,ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సప్లిమెంటరీ పరీక్షలు

లక్కవరపుకోట/కొత్తవలస: కొత్తవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల,తుమ్మికాపల్లి వాగ్దేవీ డిగ్రీ కళాశాలలో, ఎల్.కోట మోడల్ స్కూల్ కేంద్రాలుగా నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు జరిగిన పరీక్షలకు విద్యార్థులు పూర్తి స్థాయిలో హాజరయ్యారని ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు తెలిపారు. అలాగే ఎల్.కోట ఉన్నత పాఠశాల కేంద్రంలో 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఆ కేంద్రం చీఫ్ శారదాదేవి తెలిపారు. ఈ కేంద్రంలో ఎల్.కోట,వేపాడ,జామి,ఎస్.కోట మండలాలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని చెప్పారు.

కామన్ విద్యా విధానంతో సత్ఫలితాలు


మాట్లాడుతున్న విఠపు బాలసుబ్రహ్మణ్యం

విజయనగరం అర్బన్: కామన్ విద్యా విధానం ద్వారానే మెరుగైన విద్యను పేదలకు అందించవచ్చని శాసన మండలి మాజీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. యూటీఎఫ్ ఉద్యమ నేత కోరెడ్ల శేషగిరి మాస్టార్ 3వ వర్ధంతి సందర్భంగా స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాయంలో జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా శేషగిరి మాస్టారు చిత్రపటానికి పూలమాల వేసి నివాళు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగంలో పరిణామాలు సవాళ్లు, కర్తవ్యాలను వివరించారు. శేషగిరి మాస్టారు స్మారకపోన్యాసం చేయడం బాధాకరంగా ఉందన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు, శ్రీలక్ష్మి, బీఈడీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ శర్మ, ఏపీటీఎఫ్ (257) శ్రీనివాసరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్ పట్నాయక్, పీఆర్‌టీయూ నాయకుడు బంకపల్లి శివప్రసాద్, యూటీఎఫ్ నాయకులు విజయగౌరి, కె.శ్రీనివాసరావు, డి.రాము, ఎం.శ్రీనివాస, శేషగిరి మాస్టార్ తల్లి సూర్యకాంతం, మన్యం జిల్లా, శ్రీకాకుళం జిల్లా నాయకులు, పలువురు ఉపాధ్యాయులు సదస్సుకు హాజరయ్యారు.

గురుకులంలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

నెల్లిమర్ల: పట్టణంలోని వేణుగోపాలపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఉషారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతికి ఈనెల 29, ఇంటర్ సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాలకు 31న కౌన్సెలింగ్ ఉంటుందని వెల్లడించారు. అర్హత కలిగిన విద్యార్థులు తమ ఆధార్, కుల, ఆదాయ, బదిలీ సర్టిఫికెట్లతో నేరుగా కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు.